నేడు 'మీకోసం' రద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో భారీ వర్షాల కారణంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం) వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రజలు వ్యయ ప్రయాసలకు లోనై వినతులు అందజేయడానికి రావద్దని పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే మీకోసం ఫిర్యాదుల స్వీకరణను రద్దు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పోలాకి : సుసరాం వద్ద నీటమునిగిన పంట పొలాలు

ముంచెత్తిన వాన

- ఉప్పొంగిన వాగులు, గెడ్డలు
- కొట్టుకుపోయిన వ్యాన్
- ఇద్దరిని కాపాడిన స్థానికులు
- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు
- ఒకరు గల్లంతు
- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు
- నేడు విద్యాసంస్థలకు సెలవు
- మరో రెండు రోజుల పాటు వర్షాలు : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, లావేరు, రణస్థలం, పొందూరు, పోలాకి, పాతపట్నం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో శని, ఆదివారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లావ్యాప్తంగా సగటు వర్షపాతం 48.7 మిల్లీమీటర్లు నమోదైంది. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు 27.1 మి.మీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లడంతో పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పంట పొలాలు నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. వంశధార, నాగావళి, మహేంద్రతనయ నదుల్లో వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. వర్షాల ఉధృతి, వరద నీటి ప్రవాహంతో ఒకరు గల్లంతు కాగా, పూరిల్లు నేలమట్టమైంది. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌తో పాటు తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు.

పాతపట్నం : కాజ్‌వేపై ప్రవహిస్తున్న నీరు

పొంగిపొర్లుతున్న వాగులు, గెడ్డలు

లావేరు మండలంలోని అదపాక గుర్రాళ్లపాళెం మధ్యలోని బుడుమూరు పెద్దగెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గుర్రాళ్లపాళెం, కొత్తకుంకాం, పాతకుంకాం, పెద్దకొత్తపల్లి పంచాయతీల్లోని సుమారు 12 గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. బుడుమూరు సంత వద్ద పెద్ద గెడ్డ పొంగిపొర్లుతోంది. తామాడ పంచాయతీ కొత్తరౌతుపేట, రాయనింగారిపేట మధ్య గెడ్డ కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. బెజ్జిపురం, బుడతవలస మధ్యలో ఉన్న చిట్టిగెడ్డ ఉధృతితో బుడతవలస నుంచి రణస్థలం వెళ్తున్న మినీ వ్యాను మధ్యలో చిక్కుకుపోయింది. ట్రాక్టర్ సహాయంతో వ్యానుకు తాడు కట్టి ఒడ్డుకు చేర్చే క్రమంలో తాడు తెగిపోవడంతో వ్యాను నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. వాహనంలో ఉన్న డ్రైవర్ కె.వాసు, క్లీనర్ బి.అప్పలరాజును స్థానికులు కాపాడారు. రణస్థలం నుంచి రాజాం రోడ్డు సీతమ్మవలస సమీపంలో రహదారిపై వరద నీరు ప్రవహించడంతో కొంత సమయం రాకపోకలు నిలిచిపోయాయి. లావేరు, లావేటిపాలెంలోని ఎస్‌సి, బిసి కాలనీలు జలమయమయ్యాయి. పెద్దరౌతుపేట గెడ్డను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పరిశీలించారు. రణస్థలం మండలం లోని భద్రమహంకాళీ ఆలయం వద్ద బుచ్చవాని గెడ్డ పొంగిపొర్లడంతో సుమారు 40 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పొందూరు మండలంలోని బొడ్డేపల్లి, పెనుబర్తి వద్ద రైల్వే అండర్‌పాస్‌లో వరదనీరు నిలిచిపోవడంతో బొడ్డేపల్లి వద్ద రాకపోకలు సాగించకుండా రహదారిని మూసివేశారు. పెనుబర్తి వద్ద మోటారు ఇంజిన్ల సహాయంతో నీటిని బయటకు తోడుతున్నారు. బొడ్డేపల్లి అండర్‌పాస్ వద్ద రాకపోకలు నిలిపివేయడంతో మండలంలోని తాడివలస, గంగ్రేడు, గోకర్ణపల్లి, లచ్చయ్య పేట, వెంకటమ్మపేటతో పాటు ఆమదాలవలస మండలం లోని బెలమాం, లొద్దలపేట గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. పొందూరు పట్టణంలో పైడికొండ సమీపంలో నిర్మించిన జగనన్న కాలనీకి వెళ్లే రహదారికి కొండపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో రహదారి కోతకు గురైంది. దీంతో కాలనీకి రాకపోకలు సాగించేందుకు కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. కనిమెట్ట వద్ద సచివాలయం, పాఠశాల చుట్టూ వరదనీరు నిలిచిపోయింది. మహేంద్రతనయ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పాతపట్నం సమీపంలోని కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో కె.గోపాలపురం, హెచ్.గోపాలపురం గ్రామాలకు పాతపట్నం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్ఐ బి.లావణ్య, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదరావు ఆయా ప్రాంతాలను పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. శ్రీకాకుళం నగరంలోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన రహదారులు సైతం నీట మునిగాయి. భారీ వర్షానికి ఆర్‌టిసి కాంప్లెక్స్ నీటమునిగింది. కాంప్లెక్స్‌లోకి సమీప ప్రాంతం నుంచి వర్షపు నీరు చేరడంతో కాంప్లెక్స్ ప్రాంగణం జలమయమైంది.

లావేరు : గెడ్డలో కొట్టుకుపోతున్న మినీ వ్యాను

ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు

జిల్లాతో పాటు ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదుల్లో నీటి ప్రవాహం పెరిగింది. హిరమండలం మండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు నీటిమట్టం 38.07 మీటర్లుగా ఉంది. 7,196 క్యూసెక్కుల వంశధార నీరు చేరుతుండగా, అంతేమొత్తంలో దిగువకు విడిచిపెడుతున్నారు. నాగావళి నది నారాయణపురం ఆనకట్ట వద్ద 29.60 మీటర్ల లోతున ప్రవాహం కొనసాగుతోంది. 18,500 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఈ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మహేంద్రతనయ నదిలో ప్రస్తుతం 1470 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. నదుల్లో వరదనీటి ప్రవాహం పెరుగుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. భారీ వర్షాలకు చెరువులు నిండుకుండలా మారాయి. భారీ వర్షాలు ఇలాగే కొనసాగితే చెరువులకు గండ్లు పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

హిరమండలం రిజర్వాయర్ వద్ద కిందికి విడిచిపెడుతున్న వంశధార నీరు

కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

రానున్న రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని నదులు, వాగుల్లో ప్రవాహంపై మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా అధికారులతో ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాజ్ వే, వంతెనలపై నీరు ప్రవహించే చోట్ల పాదచారులు, వాహన చోదకులను నియంత్రించాలని రెవెన్యూ, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు. భారీ నష్టాలకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఫోన్ నంబరు 08942-240557కు ఫోన్ చేయాలని, ఈమెయిల్ ఐడి cosklmsupdtd@gmail.comకు ఫొటోలు పంపించాలని తెలిపారు. వినాయక పందిళ్ల వద్ద వర్షాల సమయంలో ఉండవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రసవ సమయ తేదీ దగ్గర పడుతున్న గర్భిణులను సమీప ఆసుపత్రుల్లో చేర్చేలా ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గండ్లు పడే అవకాశమున్న చెరువులు, కరకట్టలు, కాలువలపై నిఘా ఉంచి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వరద ముంపునకు గురయ్యే అవకాశమున్న గ్రామస్తులను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండాలి

ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి, ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం సోమవారం రాత్రికి ఒడిశాలోని పూరీ, పశ్చిమబెంగాల్‌లోని దిఘ మధ్య తీరం దాటుతుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నీటమునిగిన వరి చేలు

వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. పోలాకి మండలంలో లోతట్టు ప్రాంతాలైన సుసరాం, ప్రియాగ్రహారం, సత్రవుపేట, డిఎల్ పురం, అంపలాం, డోల, పల్లిపేట తదితర ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగి కాలువలను తలపిస్తున్నాయి. ఇలాగే నీటమునిగి ఉంటే పంట పాడైపోతుందన్న ఆందోళనలో రైతులున్నారు. ఏటా ఇలాంటి పరిస్థితులే ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు వరద నివారణకు శాశ్వత పరిష్కారం చూపించడం లేదని వాపోతున్నారు. వరదలు వచ్చినప్పుడు రావడం, చూసి వెళ్లిపోవడం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. వరితో పాటు మొక్కజొన్న, బొప్పాయి ఇతర ఉద్యానపంటలకూ నష్టం వాటిల్లింది.

రణస్థలం, సీతంవలస రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

వృద్ధురాలు గల్లంతు

పోలాకి మండలం ముప్పిడి గ్రామానికి చెందిన డొంకాన లక్ష్మీదేవి (80) వంశధార కాలువలో గల్లంతైంది. పక్క గ్రామమైన కొల్లివలసలో కుమార్తె ఇంటికి శనివారం వెళ్లిన ఆమె ఆదివారం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, కొల్లివలస వద్ద ఉన్న వంశధార కాలువలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయింది. స్థానికులు వెంటనే కాలువలో దూకి వెతికే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న తహశీల్దార్ ఎం.సురేష్ ఘటనాస్థలికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లను రప్పించి గాలించినా ఆచూకీ లభించలేదు. లక్ష్మీదేవి భర్త గతంలోనే మృతి చెందారు.

పొందూరు : బొడ్డేపల్లి వద్ద అండర్‌పాసేజ్‌లో నిలిచిన వరదనీరు

చిన్నమురపాకలో కూలిన పూరిల్లు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలకు లావేరు మండలంలోని చిన్నమురపాకలో కెంబూరి సీతమ్మకు చెందిన పూరిల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఆమె పక్క ఇంట్లో ఉండడంతో ప్రమాదం తప్పింది.

నేడు పాఠశాలలకు సెలవు

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల తీవ్రత దృష్ట్యా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్వాడీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. రెసిడెన్షియల్ వసతి గల పాఠశాలలు ఆహార సరుకులను సేకరించుకుని ఉంచుకోవాలని తెలిపారు. వసతిగృహాల విద్యార్థులు బయటకు వెళ్లడానికి అనుమతి ఇవ్వరాదని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ శాఖ వసతి కోసం పాఠశాలలను అడిగినప్పుడు వెంటనే ఇవ్వాలని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

117 జిఓ రద్దు చేయాలి

ఎమ్మెల్సీ పి.రఘువర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతిభవన్‌లో ఆదివారం నిర్వహించిన ఎపిటిఎఫ్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వంలో జారీ చేసిన జిఓ నంబరు 117 తక్షణమే రద్దు చేసిన అనంతరం డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులతో పాటు కెజిబివి, మోడల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు ఇంతవరకు సర్వీస్ రూల్స్ వర్తింపజేయకుండా తాత్సారం చేస్తున్నారని, ఈ సమస్యపై ఇప్పటికే శాసనమండలి సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ వంటి నూతన పెన్షన్ విధానాలను తీసుకొచ్చి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలను ఉపాధ్యాయ, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 11వ పిఆర్‌సిలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటితో పాటు 12వ పిఆర్‌సి కోసం కసరత్తు మొదలు పెట్టాలన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మీడియం విషయమై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు సమాంతరంగా నిర్వహించాలన్నారు. సంఘ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి అనిల్ కుమార్, కార్యదర్శి దాసరి రామ్మోహనరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిసిసి అధ్యక్షులుగా కృష్ణమూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, టెక్కలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా అంబటి కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఈమేరకు పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిళ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు డిసిసి అధ్యక్షులుగా ఉన్న పేడాడ పరమేశ్వరరావు స్థానంలో సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం ఆసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అంబటి కృష్ణమూర్తిని నియమించారు. డిసిసి కార్యవర్గంలో ఉన్న సీనియర్ నాయకులు బొడ్డేపల్లి సత్యవతి, సనపల అన్నాజీరావును తప్పించారు. 11 నెలల పాటు డిసిసి అధ్యక్షులుగా పనిచేసిన పరమేశ్వరరావుకు తాజా మార్పుల్లో ఉద్వాసన పలికారు. నూతన కార్యవర్గంలో సీనియర్లను తప్పించడంపై ఆ పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కృష్ణమూర్తి

తాజా,
మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

మహారాజశ్రీ విజయనగరం III అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 53/2022

Between:
S.B.I Contonment Branch ......Plaitiff
And:
Boddupu Kameswara Rao, S/o Appanna, Akkuvaram Village, Ampalam Post, Polaki Mandalam, Srikakulam District.

పై కేసులో SBI కంటోన్మెంట్ శాఖ, విజయనగరం వారు మీకు ఇచ్చిన ఋణ బాకీ వసూలు నిమిత్తం పై దావా దాఖలు చేసినారు. పై కేసు మీ హాజరు నిమిత్తం తే 22-10-2024దీన వాయిదా ఉన్నది. ఆ దినము ఉదయం 10-30 గం॥లకు మీరు స్వయంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ హాజరు కావలెను. అట్లు రాకున్నచో మీ పరోక్షమందు తీర్మానం జరుగునని తెలియజేయడమైనది.

ధవళ వెంకటరావు
వాది తరపు న్యాయవాది,
విజయనగరం,
సెల్ : 9440194894

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SRIKAKULAM
IA 611/2023 IN CMA ...... OF 2024

BETWEEN:-
Chintu Apparao
--------- petitioner/Appellant
AND:-
P.Santhi Priya
--------- Respondent /Respondent

TO
Pydisesetti Santhi Priya W/o Andavarapu Srinivasa rao, Gudi veedhi Srikakulam Town and District

Please take notice that the above Appeal IA 611 /2023 IN CMA /2024 Is posted to 10-09-2024 for your appearance ,you are hereby directed to appear before the Honourable court on 10-09-2024 without fail otherwise the matter will be decided in your absence.

B.Ganapathi patnak
Advocate Srikakulam
cell : 9492762514

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొత్తూరు
దావా నెం. 32/2024

బిట్వీన్ :
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొత్తూరు బ్రాంచ్ ....వాది
మరియు :
చెరుకూరు భగీరథ శ్రీనివాసరావు ....ప్రతివాది
తండ్రి లేటు శ్రీనివాసరావు శాస్త్రి జూనియర్ అసిస్టెంట్ ఒరియా వీధి నివాసం, శ్రీముఖలింగం గ్రామము, జలుమూరు మండలం, శ్రీకాకుళం జిల్లా ఆంధ్రప్రదేశ్

ఇందు మూలంగా ప్రతివాది అయిన మీకు తెలియజేయునది ఏమనగా! పై నెంబరు గల దావాలో శ్రీకోర్టు వారు పలుమార్లు నోటీసులు పంపినప్పటికి మీరు కావాలనే సదరు నోటీసులు తీసుకోకుండా తప్పించుకుని తిరుగుతూ కాలయాపన చేయుచున్నందున సదరు దావా శ్రీకోర్టు వారు తే 27-09-2024ది నాటికి వాయిదా వేసియున్నందున సదరు వాయిదానాడు మీరు ఉదయం 10.30గం॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా కానీ సదరు కోర్టువారి ఎదుట హాజరై మీతరుపు అక్షేపనలు, వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షం నందు తీర్మాణించబడునని శ్రీ కోర్టు వారి ఆదేశానుసారం ఈ పత్రికా మూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
శ్రీ కొత్తూరు కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
శ్రీ అరుబోలు ధర్మారావు
వాదితరుపు న్యాయవాది
ఫోన్ నెం: 6281219936

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొత్తూరు
దావా నెం. 09/2020

బిట్వీన్ :
సురవరపు వెంకటరావు .....వాది
మరియు :
కుర్మాన కాళిదాస్ ....ప్రతి వాది
తండ్రి సన్యాసి, అర్లి నివాసం, బురుజువాడ పోస్టు సారవకోట మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఇందు మూలంగా ప్రతివాది అయిన మీకు తెలియజేయునది ఏమనగా! పై నెంబరు గల దావాలో శ్రీకోర్టు వారు పలుమార్లు నోటీసులు పంపినప్పటికి మీరు కావాలనే సదరు నోటీసులు తీసుకోకుండా తప్పించుకుని తిరుగుతూ కాలయాపన చేయుచున్నందున సదరు దావా శ్రీకోర్టు వారు తే 27-09-2024ది నాటికి వాయిదా వేసియున్నందున సదరు వాయిదానాడు మీరు ఉదయం 10.30గం॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా కానీ సదరు కోర్టువారి ఎదుట హాజరై మీతరుపు ఆక్షేపనలు, వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షం నందు తీర్మాణించబడునని శ్రీ కోర్టు వారి ఆదేశానుసారం ఈ పత్రికా మూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
శ్రీ కొత్తూరు కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
శ్రీ అరుబోలు ధర్మారావు
వాదితరుపు న్యాయవాది
ఫోన్ నెం: 6281219936

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొత్తూరు
దావా నెం. 53/2020

బిట్వీన్ :
తాలాసు భవితేజ .....వాది
మరియు :
ఆబోతుల ధర్మారావు మరియు ఇతరులు ...ప్రతివాదులు
టు :
సందక / ఆబోతుల ధనం తండ్రి లేటు ఆబోతుల ధర్మారావు, హడ్కో కాలనీ, దిమ్మిడిజోల గ్రామము, భామిని మండలం, పార్వతీపురం మన్యం జిల్లా, ఆంధ్రప్రదేశ్ ......8వ ప్రతివాది

ఇందు మూలంగా 8వ ప్రతివాది అయిన మీకు తెలియజేయునది ఏమనగా! పై నెంబరు గల దావాలో మొదటి ప్రతివాది మరియు మీ తండ్రిగారైన ధర్మారావు గారు సదరు దావా పెండింగ్లో ఉ ౦డగానే మరణించి నందున సదరు వ్యక్తికి చట్టబద్ద వారసురాలుగా మిమ్మల్ని కూడా చేర్చమని ఇందున వాది పెట్టుకున్న అర్జీ మేరకు (ఐ.ఏ. నెం.56/2023 దావా నెం. 53/2020) శ్రీ కొత్తూరు కోర్టు వారు పలుమార్లు నోటీసులు పంపినప్పటికి మీరు కావాలనే సదరు నోటీసులు తీసుకోకుండా తప్పించుకుని తిరుగుతూ కాలయాపన చేయుచున్నందున సదరు దావా శ్రీకోర్టు వారు తే 27-09-2024ది నాటికి వాయిదా వేసియున్నందున సదరు వాయిదానాడు మీరు ఉదయం 10.30గం॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా కానీ సదరు కోర్టువారి ఎదుట హాజరై మీతరుపు అక్షేపనలు, వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు అర్జీ ఆమోదించబడి పైదావా మీ పరోక్షం నందు తీర్మాణించబడునని శ్రీ కోర్టు వారి ఆదేశానుసారం ఈ పత్రికా మూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
శ్రీ కొత్తూరు కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
శ్రీ అరుబోలు ధర్మారావు
వాదితరుపు న్యాయవాది
ఫోన్ నెం: 6281219936

దువ్వాడ ఇంటి ముందు ఉన్న వాణి

దువ్వాడ ఇంటి వద్ద హైడ్రామా

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటి వద్ద శనివారం మధ్యాహ్నం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దివ్వెల మాధురి దువ్వాడ ఇంట్లోకి ప్రవేశించడంతో రగడ మొదలైంది. దీంతో గత కొద్ది రోజులుగా అక్కడే ఉంటున్న దువ్వాడ భార్య వాణి, కుమార్తె హైందవి కూడా ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. దీంతో వాణి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని అక్కువరం సమీపంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నూతనంగా నిర్మించిన ఇంట్లోనే ఉంటానని వాణి ప్రవేశించడానికి తాళం బద్దలు కొట్టడానికి ప్రయత్నించింది. అయితే తాళం పగలకపోవడంతో నిచ్చెన వేసి శ్లాబ్‌పైకి వెళ్లడానికి ప్రయత్నించింది. ఇంతలో మాధురి ఆ నిచ్చెను తోసువేయడంతో వాణి శ్లాబ్‌పైకి వెళ్లలేకపోయింది. అయితే మాధురి ఆ ఇంట్లోకి ఎలా ప్రవేశించిందని పోలీసులను నిలదీసింది. వెంటనే ఆ ఇంట్లో నుంచి ఆమె పంపించాలని డిమాండ్ చేసింది. అయితే మాధురి మాట్లాడుతూ ఇల్లును తాను కొనుగోలు చేశానని, ఇంట్లో ఉండే హుక్కు ఉందని స్పష్టం చేశారు. దీంతో ఇద్దరి వాదోపవాదాలు చేసుకున్నారు. అయితే రాత్రి 11 గంటలకు సమయంలో పోలీసులు స్పందించి లా అండ్ ఆర్డర్ ఇబ్బంది కలుగుతుందని, మీరు ఇక్కడి నుంచి కాళీ చేయాలని వాణికి చెప్పారు. దీనిపై వాణి మాట్లాడుతూ మాధురి చేసిన రిజిస్ట్రేషన్ చెల్లదని, ఇంట్లోకి వెళ్లమని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపింది. అయితే కోర్టు ఉత్తర్వులు మాకొస్తే నీకు ఇంట్లోకి పంపిస్తామని పోలీసులు చెప్పాడంతో అక్కడ నుంచి వెళ్లిపోయింది.

రక్షణ కల్పించాలి : మాధురి

వాణి నుంచి తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని దివ్వల మాధురి కోరారు. ఈ మేరకు అక్కువరంలోని శ్రీనివాస్ ఇంటి వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇల్లు నాదని, ప్రాణం పోయినా విడిచి పెట్టేది లేదని స్పష్టం చేశారు. శ్రీనివాస్ ప్రస్తుతం తన నివాసంలో ఉంటున్నారని అన్నారు. అనంతరం మాధిరి తన పేరున ఉన్న రిజిస్ట్రేషన్ ఇంటి పత్రాన్ని విలేకరులకు చూపించారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

హుదూద్ ఇళ్లు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడిన ప్రభావంతో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. మండలంలోని కుందువానిపేటలో హుదూద్ ఇళ్లను ఆదివారం పరిశీలించారు. శ్లాబ్‌లకు పూర్తిగా పెచ్చులూడిపోయి వర్షపు నీరు ఇళ్లల్లోకి కారిపోతుండడాన్ని గమనించారు. కూలిపోయేందుకు భవనాలు సిద్ధంగా ఉన్నాయని, తమను ఆదుకోవాలని ప్రజలంతా ఎమ్మెల్యేను కోరారు. రోజంతా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. అధైర్యపడవద్దని, మీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ ఎస్.అప్పన్న ఉన్నారు.

వర్షాలపై అప్రమత్తం

బూర్జ : నాగావళి నది తీరా ప్రాంతాలు లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పండా వీధి అనుకుని ఉన్న నాగావళి నదిని పరిశీలించారు. కరకట్టలు లేకపోవడంతో నాగావళి నది నీరు గ్రామంలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈయనతో పాటు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎ.రామకృష్ణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సీతారాం బాబునాయుడు, ఉపాధ్యక్షుడు పి.కన్నం నాయుడు, ఎంపిటిసి పోలినాయుడు, జడ్డు కృష్ణ, అంపిలి గణపతిరావు, మేడి ప్రసాద్ ఉన్నారు.

లావేరు : మండలంలోని తామాడ, బుడుమూరు, రాయినింగిపేట, అదపాక గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పర్యటంచారు. వర్షాలు పూర్తిగా తగ్గేంతవరకు బయటకు రావద్దని సూచించారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, బిజెపి నాయకుడు ఇజ్జాడ శ్రీనివాసరావు, గొర్లె శ్రీనివాసరావు, లంక శ్యామలరావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : మండలంలోని కొవ్వాడ, అల్లివలస, జీరుపాలెం, కొచ్చెర్ల గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పర్యటించారు. మత్స్యకారులు బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లొదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈయన వెంట ఎంపిటిసి బస్వ గోవిందరెడ్డి, లెంక శ్యాం, పిసిని జగన్నాథం నాయుడు, సుంకరి ధనుంజయ్, దుమ్ము అశోక్, ముక్కు ఆదినారాయణ ఉన్నారు.

కవిటి: తీరప్రాంత గ్రామస్తులు, వ్యవసాయ పనులు చేసేవారు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి కె.అప్పలస్వామి, తహశీల్దార్ మురళీమోహన్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం

కవిటి : మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు

రణస్థలం : పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

మండలస్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 56.7 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మరో మూడు రోజులపాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందిందని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు తమ తమ పరిధిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లకూడదని ఆదేశించారు. మండలంలో కొత్తపాలెం, చిన్నకర్రివానిపాలెం, ఇద్దివానిపాలెం తీర ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం చేయాలని సూచించారు. 9515461147 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని కోరారు. అనంతరం ఇద్దివానిపాలెంలో పర్యటించి మత్స్యకారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.రాము, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ ధనుంజయ మజ్జి, డిటి రామచంద్రరావు, ఆర్ఐ రమణమూర్తి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఎపిఒ మోహనరావు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని నదీ పరీవాహక ప్రాంతంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి ఆర్.వెంకటరామన్ సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో సమీక్షించారు. అలాగే తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్‌తో కలిసి డోలగోవిందపురం, పల్లిపేట, రాజారాంపురం గ్రామాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిటి పి.శ్రీనివాసరావు, సర్వేయర్ శ్రీరామ్మూర్తి, వంశధార జెఇ శ్యామలరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలం, మున్సిపాలిటీ ప్రాంతాల ప్రజలు వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ వెంకటరావు అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు సమాచారం అందేయాలని సూచించారు.

కోటబొమ్మాళి: వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఆర్ గడ్డెమ్మ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆర్.మధు, ఇఒపిఆర్‌డి బి.రామారావు పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని హెచ్చు గోపాలపురం, కాపుగోపాలపురం గ్రామాల్లో ఎస్ఐ బి.లావణ్య, డిటి ప్రసాదరావు తన సిబ్బందితో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. వీరితో పాటు ఎఎస్ఐ శ్రీనివాసరావు, విఆర్ఒ పార్థసారథి ఉన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని పూడిలంక, మంచినీళ్లపేట, హుకుంపేట, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు గ్రామాల్లో తహశీల్దార్ పి.బాల పర్యటించారు. మత్స్యకారులెవరూ వేటకు వెళ్లకూడదంటూ దండోరాలు వేయించి వారికి అప్రమత్తం చేశారు. ఈయనతో పాటు టిడి గిరిరాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పలాస : ప్రస్తుత వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తి అధికారులను ఆదేశించారు.

పలాస : వరద నీటిని పరిశీలిస్తున్న రమణమూర్తి

తహశీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. అనంతరం కంబిరిగాం కూడలి వరహాలగడ్డ, అమలకుడియా, పూర్ణభద్ర తదితర వరద ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని కలివరం వద్ద నాగావళి నదీ పరివాహక ప్రాంతాన్ని ఇరిగేషన్ ఎస్ఇ సుధాకర్, ఎంపిడిఒ వాసుదేవరావు, తహశీల్దార్ రాంబాబులు పరిశీలించారు. ప్రజలెవరూ నదిలోకి దిగరాదని సూచించారు. వీరి వెంట ఎస్ఐ కె.వెంకటేష్, ఇఒపిఆర్‌డి దుంపల గోవిందరావు ఉన్నారు.

అలాగే పట్టణంలోని దాలినాయుడు క్వార్టర్స్ వీధి రహదారి పూర్తిగా జలమయమైంది. దీంతో రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఇళ్లలో వర్షపు నీరు ప్రవేశించి అక్కడ నివాసం ఉంటున్న పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పొందూరు : మండలంలోని బొడ్డేపల్లి, పెనుబర్తి రైల్వే అండర్ పాస్‌ల్లో నిలిచిన వర్షపునీటిని తహశీల్దార్ రమేష్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి గణేష్‌లు పరిశీలించారు. అనంతరం ఇంజిన్ల సహాయంతో బయటకు తోడించారు.

పోలాకి: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న సందర్భంగా నదుల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తుందని, అందుకని స్నానాలకు ఎవరూ దిగవద్దని ఎస్ఐ జి.రంజిత్ సూచించారు. నదీ పరీవాహక ప్రాంతాలైన డోల, గోవిందపురం, పల్లిపేట గ్రామాల్లో ప్రకటించి ప్రజలకు అవగాహన కల్పించారు.

టెక్కలి రూరల్ : టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి, డ్వామా ఎపిడి ఎం.శైలజ, ఎంపిడిఒ సిహెచ్.లక్ష్మీబాయ్ ఆధ్వర్యాన కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వీరితో పాటు కార్యాలయ ఎఒ హెచ్.వి.రమణమూర్తి, ఎపిఒ బి.ప్రసాదరావు ఉన్నారు.

కొత్తూరు : వంశధార నదీపరివాహక ప్రాంతాలైన వలస, నివగాం, మాతల గ్రామాల్లో టెక్కలి ఆర్‌డిఒ సుదర్శన్‌దొర పర్యటించారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ ఏర్పాటు చేశామని, సమాచారం అందజేయాలని సూచించారు. గ్రామాల్లో దండోరా వేయించాలని విఆర్‌ఒలకు ఆదేశించారు. ఈయనతో పాటు డిటి సత్యనారాయణ, బి.పాపారావు, ఆర్ఐ లక్ష్మణరావు, విఆర్‌ఒలు రాజగోలరావు, సత్యనారాయణ, నారాయణరావు ఉన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

22 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో కొన్నేళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న గంజాయి వాడకం మూలాలను గుర్తించి శనివారం 9 మందిని అరెస్టు చేసినట్టు ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పొన్నాడ బ్రిడ్జి పక్కన సాయి గిరి ఆలయానికి వెళ్లే రోడ్డులో బైక్‌పై వెళ్తున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నామని తెలిపారు. వారిని తనిఖీ చేయగా, వారి నుంచి ఐదు కిలోల గంజాయి లభ్యమైనట్టు అన్నారు. వారి నుంచి రెండు బైక్‌లు, గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిని విచారించిన తర్వాత డచ్ బంగాళా వద్ద మరో ఐదుగురు ఉన్నట్టు గుర్తించామన్నారు. వారినీ చాకచక్యంగా పట్టుకుని నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి కూడా 17 కిలోల గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను

వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

స్వాధీనం చేసుకొన్నట్టు వివరించారు. వారితో పాటు గంజాయి వినియోగిస్తున్న మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా పొత్తంగి బ్లాక్ కందిలికి చెందిన హరీష్, అదే గ్రామానికి చెందిన బంక జోషఫ్, అదే రాష్ట్రం బూరుగుల పాడుకు చెందిన సీనాల నుంచి కిలో గంజాయి రూ. 3 వేలుకు శ్రీకాకుళానికి చెందిన వల్లంశెట్టి చందు, సైలాడ వేణుగోపాలరావు, కొల్లి యశోదారావు, అందాల సాయి నిఖిల్, చీకటి యోగేశ్వరరావు, జామి మోహనకృష్ణ, జలగడుగుల కృష్ణవంశీ, జలగడుగుల వికాస్‌లకు చేరవేస్తున్నారని అన్నారు. వీరు నగరంలో యువతకు గంజాయి పీల్చే అలవాటు ఉన్న వారిని ఎంచుకుని నమ్మకమైన వ్యక్తుల ద్వారా కేజీ గంజాయి రూ.5 వేలు వంతున విక్రయిస్తున్నారని తెలిపారు. వీరిచ్చిన ఆర్డర్లను బట్టి ఒడిశాకు చెందిన ముగ్గురు వ్యాపారులు శ్రీకాకుళం పరిసరాలకు చేరవేస్తుంటారన్నారు. నగరంలో చందుతో పాటు ముఠా సభ్యులు 30 గ్రాముల గంజాయిని రూ.400కు అమ్ముతున్నారని గుర్తించినట్టు తెలిపారు. ఇలా నగరంలో యువతకు మత్తులో ముంచి రూ.లక్షల్లో ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్న దురాలోచనతో ఈ వ్యాపారం సాగిస్తున్నట్టు నిందితులు అంగీకరించారని వెల్లడించారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, గంజాయి వినియోగిస్తున్న ఎనిమిది మందిని వారి తల్లిదండ్రుల సమక్షంలో గాని, డి-అడిక్షన్ రిహాబిలిటేషన్ కేంద్రాల ద్వారా గాని కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు నిత్యం పిల్లల ప్రవర్తనను ఎల్లప్పుడు గమనించాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల అనేక దుష్ప్రభావాలు ఉన్నాయని, అందువల్ల వీటికి దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో క్రియాశీలంగా వ్యవహరించిన ఎస్‌బి ప్రత్యేక బృందాల సిబ్బంది, డిఎస్‌పి వివేకానంద, సిఐ పైడపునాయుడులను అభినందించారు.

చెక్కును అందజేస్తున్న డాక్టర్ సురేష్‌కుమార్

డిసిసిబి కాలనీ సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని డిసిసిబి కాలనీలో ఆదివారం ఉదయం కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే ఎమ్మెల్యే గొండు శంకర్‌లు సందర్శించారు. స్థానికులు ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు విజయవాడ వరద బాదితుల సహాయనిధికి రూ.20వేలు ఆర్థిక సాయాన్ని కేంద్రమంత్రికి చెక్కును డాక్టర్ జి.సురేష్ కుమార్ అందజేశారు.

యువకుడు హల్‌చల్

విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన బాబూరావు

సరుబుజ్జిలి : మండలంలోని రొట్ట వలసలో శనివారం ఓ యువకుడు హైవోల్టేజ్ విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. సుమారు రెండు గంటల పాటు విద్యుత్ స్తంభంపై యువకుడు ఉండడంతో స్థానికులు అరికాం - బత్తిలి రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురికావాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... రొట్టవలస అయ్యప్ప సప్లయర్స్‌లో దినసరి కూలీగా వెన్నెలవలసకు చెందిన బాబూరావు అనే యువకుడు పనిచేస్తున్న వినాయక చవితి నేపథ్యం మద్యం తాగి విద్యుత్ స్తంభం ఎక్కి హైవోల్టేజ్ విద్యుత్ వైర్లను తాకి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన ఎంపిటిసి మాజీ సభ్యులు తాడేల వెంకటరమణ వెంటనే స్పందించి విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సరఫరాను నిలిపివేయించారు. అనంతరం ఆ యువకుడిని విద్యుత్ స్తంభంపై నుంచి కిందకి దింపి పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. యువకుడి తల్లిదండ్రులను పోలీసులు పిలిచించి కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించారు.

గేదెను పరిశీలిస్తున్న ఎడి దుర్గారావు

చెరువులో పడి గేదె మృతి

రణస్థలం : మండల కేంద్రంలోని గంగి నాగమణికి చెందిన గేదె ఆదివారం చెరువులో పడి మృతి చెందింది. అల్పపీడనం కారణంగా భారీ వర్షాలకు చెరువు గట్టు జారుగా ఉండడంతో చెరువు గట్టున మేతమేసుకుంటూ పడిపోయింది. గేద ముందు కాళ్లకు జోడి కట్టి ఉండడంతో మునిగిపోయింది. బాధితురాలు నాగమణి మాట్లాడుతూ సుమారు రూ.70 వేలు విలువ చేసే గేదె చనిపోవడంతో కుటుంబానికి ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న రణస్థలం పశుసంవర్ధకశాఖ ఎడి బి.దుర్గారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. విఆర్‌ఒ దేవి, పశుసంవర్ధకశాఖ వైద్యులు చంద్రశేఖర్, లావణ్య, గాయత్రి, అసిస్టెంట్ జె.సాయి పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం

గాయపడిన విద్యార్థి

మెళియాపుట్టి: మండల కేంద్రంలో ఆదివారం పిచ్చికుక్కలు స్వైరవిహారం చేసి నలుగురు విద్యార్థులను గాయపడిచింది. ఆరుబయట సారధిశ్రీభరత్, హర్షవర్ధన్, ఆర్.నేతాజీ, గౌతం ఆడుకుంటుండగా... కుక్క కాటు వేసింది. వెంటనే క్షతగాత్రుల తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మండల కేంద్రం చుట్టూ వైపులా చికెన్ షాపులు ఏర్పాటు చేయడంతో కుక్కలు అధికంగా చేరి అనంతరం దాడులకు దిగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులకు వెంటాడుతుండడంతో భయాందోళనకు చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

జిల్లా ప్రజల జీవనశైలి 'సంతపాట'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సిక్కోలు ప్రజల జీవనశైలిని ప్రతిబింబించే విధంగా శ్రీకాకుళం సంతపాట ఉందని సారవకోట ఎంపిపి చిన్నాల కూర్మినాయుడు అన్నారు. నగరంలోని హయాతినగరం కూడలిలో ఉన్న జైభవాని కళ్యాణ మండపంలో శ్రీకాకుళం సంతపాట పాటల సిడిని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కళలకు, సాంస్కృత సంప్రదాయాలకు పెట్టింది పేరని, ఆ వైభవాన్ని దేశ నలుమూలల చాటాలని ఆకాంక్షించారు. సిక్కోలు యువతలో ప్రతిభాపాటవాలు పుష్కలంగా ఉన్న ప్రోత్సహించేవారు లేక మరుగున పడుతోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, ఆదరించేవారు కరువై కళాకారులు తమ ప్రతిభను చాటుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హీరో ప్రిన్స్ నోకియా మాట్లాడుతూ ఈ పాట చిత్రీకరణకు నాలుగు రోజులు సమయం పట్టిందన్నారు. నిర్మాత ఇప్పిలి రామ్మోహన్ సహకారం మరువలేనిది అన్నారు.

సిడిని ఆవిష్కరిస్తున్న కూర్మినాయుడు

తన సొంత ఊరు పలాస అని, సినిమాలపై ఉన్న మక్కువతో ఇప్పటివరకు మూడు వేలకు పైగా రీల్స్ చేశానని తెలిపారు. సినిమాల్లోకి రావడానికి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తనకు స్ఫూర్తి అని చెప్పారు. ఈ పాటకు సహకారం అందజేసిన హీరోయిన్ డింపుల్ అమ్ము, కొరియోగ్రాఫర్ జోష్ శివ, రవిలకు కృతజ్ఞతలు తెలిపారు. యూట్యూబ్‌లో రామ్ సినీ క్రియేషన్స్ అని టైప్ చేసి శ్రీకాకుళం సంత పాటను చూసి మమ్మల్ని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి వైదేహి తన యాంకరింగ్‌తో అందరినీ అలరించింది.

మాట్లాడుతున్న ప్రసాదరావు

నేత్రదానంపై అవగాహన అవసరం

టెక్కలి/రూరల్: నేత్రదానం అంధులకు ఆశాజ్యోతిని నేత్ర వైద్య సహాయకులు జె.ఎస్.ప్రసాదరావు అన్నారు. ప్రజా చైతన్య కళా సమితి భవనం వద్ద అధ్యక్షులు యు.గణపతిరావు అధ్యక్షతన అంతర్జాతీయ 39వ జాతీయ నేత్రదానం పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేత్రదానంపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని అన్నారు. మరణానంతరమే నేత్రదానం చేయాలని సూచించారు. కళా సమితి ఆధ్వర్యాన ఇప్పటికే టెక్కలి పరిసర గ్రామాల నుంచి 50 మందితో నేత్రదానాలు చేయించి వంద మంది కళ్లల్లో వెలుగులు నింపడం ఓ మైలురాయి అన్నారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు వాటిని అధిగమించే విధానాలు, సాంకేతిక అంశాలు వివరించారు. కార్యక్రమంలో అనిశెట్టి చిట్టన్న, తూట భాస్కరరావు, చిలుకు కృష్ణారావు, అర్.వి.రమణమూర్తి, జి.మోహన రావు, డి.పాపారావు, ఎస్.లక్ష్మీనారాయణ, ఎం.జగన్నాథరావు, బి.శేషగిరి పాల్గొన్నారు.

అంధకారంలో ఆమదాలవలస

ఆమదాలవలస : పట్టణంలో వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లు ముసురుకున్నాయి. గడచిన కొంతకాలం నుంచి రాత్రి వేళలో వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంగా మారి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక సంఘం పరిధిలోని 23 వార్డుల్లో కూడా పూర్తి స్థాయిలో వీధి దీపాలు రాత్రి వేళలో వెలగడం లేదు. అక్కడక్కడా వెలగడంతో చీకట్లోలో కాలం వెల్లదీస్తున్నారు. శనివారం పట్టణంలోని లక్ష్మీనగర్ వీధికి చెందిన సత్యసాయి సేవకుడు తమ్మన బంగార్రాజు వీధుల్లో అవసరమైన చోట వీధి దీపాలు లేకపోవడంతో అంధకారం అలముకోవడంతో లక్ష్మీనగర్ దరిద్ర నగరంగా మారిందని మున్సిపల్ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ ఆడియో రికార్డును విడుదల చేశారు. వీధి దీపాలపై ప్రశ్నిస్తూ బంగారు రాజు చేసిన ఆడియోను సమర్థిస్తూ పట్టణంలోని మరికొన్ని వార్డులకు చెందిన ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో కూడా వీధి దీపాలు వెలగక పోవడంతో రాత్రివేళ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీనిపై పలుమార్లు అధికారులకు మున్సిపల్ సిబ్బందికి తెలియజేశారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ నిర్వహించిన సమీక్షలో పట్టణంలోని వీధి దీపాలపై అధికారులను ప్రశ్నించగా, ఎల్‌ఇడి వీధి దీపాల కాంట్రాక్టు ఒప్పంద కాలం పూర్తి అయ్యిందని, అందుకే వీధి దీపాల లోటు కొంతమేర ఉన్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కూన రవికుమార్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కర్నెన దీప అధ్యక్షతన ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో 16 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయని, రైతులకు సక్రమంగా సేవలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని దేశించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా ఆయా కేంద్రాల్లోనే సిబ్బంది ప్రజలకు అందుబాటులో

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఉండాలని ఆదేశించారు. కేవలం ఆయా సెంటర్లకు వచ్చి తమ వ్యక్తిగత పనులతో బయటకు వెళుతున్నారని అన్నారు. ఎప్పుడు వస్తున్నారో, వెళ్తున్నారో మినిట్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. మండల సమావేశాలకు పూర్తి సమాచారం లేకుండా ఎలా హాజరవుతారని ప్రశ్నించారు. ఇటీవల సొసైటీలో కోట్ల రూపాయలు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని, వాటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాలని అన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు ఎందుకు అందించలేదని ఎఒ శ్రీనివాసరావును ప్రశ్నించారు. ఎఒ స్పందిస్తూ... గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించిన ఎరువుల మొత్తాన్ని వ్యవసాయశాఖ సిబ్బంది సకాలంలో కట్టకపోవడంతో ఈ సమస్య తలెత్తుతుందని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మండలంలోని అన్ని గ్రామాలలో క్షుణ్ణంగా పరిశీలించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు ముఖ్యంగా గ్రామీణ రహదారులు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, కరణం కృష్ణంనాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎ.రామకృష్ణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వావిలపల్లి సీతారాం బాబునాయుడు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు.

'పొలం పిలుస్తుంది' పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట : వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యక్రమాలపై రూపొందించిన పొలంబడి పోస్టర్‌ను ఎమ్మెల్యే అశోక్ ఆదివారం ఆవిష్కరించారు. నరసింహమూర్తితో పాటు పశు సంవర్ధక, ఉద్యానవనశాఖ అధికారుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ నరసింహమూర్తి మాట్లాడుతూ సెప్టెంబరు 10 నుంచి ప్రతి వారంలో మంగళ, బుధవారాల్లో గ్రామస్థాయిలో పొలంబడి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలను ప్రత్యక్షంగా తెలియజేసి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతులు

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీ నగర్ కాలనీలో రోడ్డు గుంతలమయమైంది. దీంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. దీనిపై సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు స్పందించి ఆదివారం రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఎద్దు శ్రీను, జగదీష్, వెంకటరావు ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఆందోళనలో కాలనీవాసులు

పొందూరు: అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొందూరు పంచాయతీ పరిధిలోని ఎరుకుల కాలనీ చుట్టూ వరదనీరు చేరింది. దీంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. కాలనీని ఆనుకుని ఉన్న సీతారాం కోనేరులో వరదనీరు పెద్దఎత్తున చేరింది. దీంతో అక్కడ ఉన్న పాన్పులగెడ్డ కల్వర్టు, కోనేరు కల్వర్టు మూసుకుపోవడంతో వరదనీరు బయటకు పారడం లేదు. దీనివల్ల కాలనీ చుట్టూ వరదనీరు చేరిపోయి ఇళ్లు మునిగిపోతాయంటూ కాలనీవాసులు భయాందోళన చెంది అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు, టిడిపి నాయకులు వెంటనే ప్రొక్లెయినర్ సహాయంతో మూసుకుపోయిన కల్వర్టులను తెరిచి వరదనీరు బయటకు తరలించారు. ఈ పనులను మండల ప్రత్యేకాధికారి నగేష్, ఎమ్మెల్యే సతీమణి కూన ప్రమీల, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఇఒ మోహన్‌బాబు, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎ.శ్రీరంగనాయకులు, ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగశంకర భాస్కరరావు పరిశీలించారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

ఆమదాలవలస : పురపాలక సంఘం పరిధిలో సోమవారం కుళాయిల ద్వారా సరఫరా చేసే మంచినీటి సరఫరాకు అంతరాయం కలగనుందని మున్సిపల్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రధాన నీటి సరఫరా కేంద్రం అలమాజీపేట పంప్ హౌస్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో పట్టణంలోని పూజారిపేట, ఐ.జె.నాయుడు కాలనీ, చంద్రయ్యపేట, విద్యానగర్ ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రేషన్ డిపో ప్రారంభం

ఇచ్ఛాపురం: మండలంలోని పాయతారు పంచాయతీలో కొత్తగా ఏర్పాటు చేసి రేషన్ డిపోను ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులు సక్రమంగా లబ్దిదారులకు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాలను అందజేశారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలోని గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు దక్కత ఢిల్లీరావు, మెరుగు సూర్యనారాయణరెడ్డి, లొపింటి పద్మనాభం, ప్రకాశ్ నాయక్, నందిక జాని, గిన్ని బాలరాజు, శాడి సహదేవ్‌రెడ్డి, లోహిదాసు పాల్గొన్నారు.

రేషన్ డిపోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

మాట్లాడుతున్న మస్తాన్

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా కార్మిక చట్టాలు సవరణ చేస్తూ హక్కులను కాలరాస్తున్నారని పికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె.మస్తాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బొడ్డపాడులో జిల్లా అధ్యక్షులు దేవాడ నారాయణమూర్తి అధ్యక్షతన ఆదివారం జిల్లా మహాసభలు నిర్వహించారు. ముందుగా జిల్లా కార్యదర్శి పుచ్చా దుర్యోధన జెండా ఆవిష్కరించారు. పికెయస్ కళాకారులు యాదిగిరి ఆధ్వర్యాన విప్లవ గేయాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా స్వామిక వాదులపై అక్రమ కేసులు పెట్టి జైల్లో నిర్భందిస్తూ అప్రకటిత ఎమర్జెన్సీ విధానం అమలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఉద్దాన ప్రాంతంలో జీడి రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నపూర్ణ, రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి, పి.ధర్మా రావు, బి.ప్రభాకర్, జోగి కోదండ, ఎన్.అడ్డి, టి.శ్రీనివాస రావు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. జిల్లా అధ్యక్షులుగా మద్దిలి ధర్మారావు, ఉపాధ్యక్షులుగా కారి పురుషోత్తం, జి.కూర్మారావు, ప్రధాన కార్యదర్శి గా పుచ్చ దుర్యోధన, సహాయ కార్యదర్శిగా కుత్తం ఢిల్లీరావు, మామిడి గణపతి, కోశాధికారి దేవాడ నారాయణమూర్తి, కార్యవర్గ సభ్యులు మజ్జి పాపారావు, ఎం.రాజారావు, ఎస్.ఈశ్వరరావు, ఎం.షణ్ముఖరావు, అందాల కోటి, తెలుకల ఋషికేశవరావు, బి.మోహనరావు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన అవసరం

సంధ్యారాణి, ఫిజియోథెరపీ వైద్యులు

కోటబొమ్మాళి: ప్రస్తుతం ఎక్కువ శాతం ప్రజలు గుండెపోటు బారిన పడుతున్నారని, అందుకు ప్రతిఒక్కరూ సిపిఆర్ అవగాహన కలిగి ఉండాలని ఫిజియోథెరపీ వైద్యులు లఖినేని సంధ్యారాణి అన్నారు. స్థానిక విద్యుత్ నగర్ నివాసముంటున్న చిన్నప్పన్న శనివారం అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. వెంటనే అమె పరిశీలించి గుండె అగిందని గుర్తించి ఆయనకు సిపిఆర్ చేశారు. దీంతో వెంటనే ఆయన గుండె కొట్టుకోవడంతో లెగిచి కూర్చోన్నాడు. ఆమె నరసన్నపేట, కోటబొమ్మాళిలో పిజియోథెరపీ వైద్యులుగా పనిచేస్తున్నారు. ఆమె న్యాయవాధి లఖినేని శ్రీనివాసరావు కుమార్తె, ప్రముఖ పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ సోదరి కావడంతో ఈ విషయం సామాజిక మాద్యమాల్లో చెక్కర్ల కొడుతుంది.

సిడిని ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

జానపద పాటల సిడి ఆవిష్కరణ

సోంపేట : మండలంలోని కొర్లాంకు చెందిన బంగారు రాజు రచించిన శ్రీకాకుళం జానపద పాటల సిడిని ఆదివారం స్థానిక వినాయక మండపం వద్ద పెద్దలు ఆవిష్కరించారు. బిఎల్ఆర్ ప్రొడక్షన్స్ పేరిట ఛానల్‌లో రూపొందించిన బంగారోడు పాటలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ప్రఖ్యాతిగాంచిన శ్రీకాకుళం జానపదాలను ఈ తరానికి అందించేందుకుకృషి చేస్తున్న రాజు అభినందనీయుడు అన్నారు.

పోరాటాల్లో భాగస్వామ్యం కావాలి

మాట్లాడుతున్న దాలయ్య

టెక్కలి : విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలతో ఉపాధ్యాయ సంఘాలు భవిష్యత్‌లో చేయబోయే పోరాటాల్లో భాగస్వామ్యం అవసరమని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య పిలుపునిచ్చారు. స్థానిక మెయిన్ బజారు పాఠశాలలో యుటిఎఫ్ మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని కాపాడుకోవాలిసింది పోయి తన బాధ్యతల నుంచి తప్పుకుంటుందని అన్నారు. ప్రాథమిక పాఠశాలల విలీనం చేసే జిఒలను తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మాద్యమాలు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు పాలవలస ధర్మారావు, సత్తార్ రాంబాబు, బి.లత, రమేష్‌కుమాం, రాముముని రమేష్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా మారం కుమారస్వామి, అధ్యక్షులుగా పి.గణపతిరావు, కార్యదర్శిగా తమ్మినేని వైకుంఠరావు, కోశాధికారిగా రోణంకి విజయ్‌కుమార్, సహాధ్యక్షులుగా నంబూరు ప్రభావతి, డొంకాన పాపారావులను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఎన్నికల కమిటీ అధికారులుగా కురమాన దాలయ్య, బాలక శంకరరావులు వ్యవహరించారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

జనసేన బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని ఆనందపురం పంచాయతీ మాదిగాపురంలో ఆదివారం జనసేన పార్టీ టెక్కలి ఇన్‌ఛార్జి కణితి కిరణ్ ఆధ్వర్యాన జనసేన జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. కిరణ్ మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలను తెలియజేస్తూ... పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం బుజ్జి, విష్ణు, సురేష్, మనోజ్, అనిల్, అన్వేష్, రాజ్యలక్ష్మి, ఉషారాణి, శాంతి, దమయంతి, ఈశ్వరమ్మ, బెండి బాలకృష్ణ, నీలాచాలం, ఆదినారాయణ పార్టీలోకి చేరారు. తదితరులు జనసేనపార్టీలో చేరారు. వీరికి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిరంజీవి, జిల్లా కార్యవర్గ సభ్యులు షణ్ముఖ, కోటి, గవరయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకుడు

దుగానపుట్టుగలో రక్తదానం

ప్రజాశక్తి- కవిటి

వినాయకచవితి సందర్భంగా మండలంలోని దుగానపుట్టుగలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జ్ఞానోదయ కేంద్రం - స్నేహితా ఫౌండేషన్ ఆధ్వర్యాన ఎస్ఎస్ ఫౌండేషన్ సహకారంతో జరిగిన ఈ శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రోజురోజుకూ పెరిగిపోతున్న అనారోగ్య సమస్యల దృష్ట్యా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలనే ఆలోచనతో ఈ శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సిసింద్రీ, దివాకర్, తిరుపతి, దుర్గాప్రసాద్, సురేష్, భాస్కర్, ప్రదీప్, క్రాంతి పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పాతపట్నం: ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎలక్ట్రానిక్ మీడియా మండల అధ్యక్షుడు రావాడ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ఇటీవల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నీలమనదుర్గ అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పౌరుడూ ఒక మొక్క నాటి ఆకుపచ్చ ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలో తన వంతు పాత్ర పోషించాలన్నారు. అడవులు అంతరించిపోకుండా కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కంచరాన రవి, కట్ట మోహన్, బిల్లాన సుధాకర్, గోపీకృష్ణ పట్నాయక్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న అశోక్‌కుమార్

ఆకట్టుకున్న బొజ్జ గణపతులు

ఆకట్టుకున్న కర్ర పెండలం, ఆవాలు గణపతులు

ప్రజాశక్తి - కవిటి

పర్యావరణహితాన్ని కోరుతూ గత పదేళ్లకు పైగా వినూత్న ఆలోచనతో వినాయక విగ్రహాలు రూపొందించడంలో మండలంలో ప్రత్యేకత చాటుకుంటున్న బొరివంకలో వినాయక చవితి రోజున జరిగిన మరో ఆసక్తికర సంఘటన ఆ గ్రామం వైపు చూసేలా చేసింది. గ్రామానికి చెందిన మజ్జి బొనమాలి తన పెరట్లో వేసిన కర్ర పెండలం చెట్టు పెకిలించగా అందులో వచ్చిన దుంపల్లో ఒకటి వినాయకుని ఆకారంలో ఉండడం గమనించాడు. దీంతో ఆ దుంపను తమవీధిలోని వినాయక మండపం వద్ద ఉంచడంతో వైరల్‌గా మారింది. ఈ విషయం తెలుసుకున్న పరిసర ప్రాంతాల ప్రజలు దాన్ని చూసేందుకు బారులు తీరారు.

అలాగే బొరివంకలోని పెద్ద ఒరియా వీధిలో ఏర్పాటు చేసిన ఆవాలు గణపతి చవితి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. లక్ష్మీగణపతి కమిటీ సభ్యుల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాల్లో కమిటీ సభ్యుడు, గ్రామానికి చెందిన శిల్పి గుణనిధి బిసాయి ఆవాలతో గణపతి విగ్రహాన్ని రూపొందించారు. అయోధ్యరాముని ఆకారంలో పర్యావరణహితాన్ని కోరుతూ ఏర్పాటు చేసిన ఈ విగ్రహం ప్రస్తుతం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

లడ్డును అప్పగిస్తున్న కమిటీ సభ్యులు

లడ్డు వేలం పాట రూ.27వేలు

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగలోని మారేడు దుర్గా కమిటీ ఆధ్వర్యాన వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన లడ్డు వేలంలో గ్రామానికి చెందిన పిరియా విశేశ్వరరావు, అట్టాడ నరసన్న సంయుక్తంగా రూ.27 వేలకు లడ్డూ దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పూడి భీమారావు, బడ్డ అప్పారావు, కె.మాధవరావు, కృష్ణారావు, కె.వాసు, కె.కోటేశ్వరరావు, మన్మథరావు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

చాపర కల్వర్టు వద్ద ఏర్పడిన గొయ్యి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పలుచోట్ల బిటి రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పట్టుపురం-మందస రోడ్డు సరిహద్దు నుంచి గొప్పిలి వరకు రెండు కిలోమీటర్లు రహదారి పూర్తిగా గుంతలమైమైంది. దీంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టుపురం-చాపర మధ్య అర కిలోమీటర్ రహదారి అధ్వానంగా తయారైంది. చాపుర నుంచి పోలీస్ స్టేషన్ వరకు, అలాగే ఆల్ ఆంధ్రా రోడ్డులోని పెద్దపద్మాపురం నుంచి సుందరాడ వరకు రోడ్డు గుంతలమయమైంది. చాపర జీడిపిక్కల ఫ్యాక్టరీ సమీపంలో కల్వర్టు పూర్తిగా పాడై పెద్ద రంధ్రం ఏర్పడింది. పట్టుపురం ఆఫ్ సోర్ కెనాల్ వద్ద రెల్ల గడ్డి రోడ్డు కిరువైపులా కప్పేయడంతో వాహనాల రాకపోకలకు అసౌకర్యం ఏర్పడింది. గోపినాటథపురం సమీపంలోని రోడ్డు కల్వర్టుకు ఇరువైపులా మట్టి కుమిలిపోవడంతో గుంతలుగా ఏర్పడడంతో ఇక్కడ వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి రహదారులు మెరుగుపడేలా చూడాలని పలువురు వాహనదారులు స్థానికులు కోరుతున్నారు.

పట్టుపురం వద్ద రోడ్డును కప్పేసిన రెల్లగెడ్డ

ముమ్మరంగా పారిశుధ్య పనులు

చెత్తను తొలగిస్తున్న గ్రామస్తులు

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీలో ఉన్న చిన్న హరిశ్చంద్రపురంలో శనివారం వినాయక చవితి సందర్భంగా గ్రామస్తులు ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. పండగ పూట అందరూ ఇంటి వద్దనే ఉండడంతో యువత, గ్రామస్తులు వీధుల్లో చెత్తా చెదారాలను పారబోశారు.